క్లుప్తంగా

మండల కమిటీ ఎన్నిక


ఇంద్రగోపాల్, అధ్యక్షుడు


ఆసీఫ్, ప్రధాన కార్యదర్శి

టేకుమట్ల: పీఆర్‌టీయూ తెలంగాణ నూతన మండల కమిటీని మంగళవారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు ఆరె రాకేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ వివరాలను వెల్లడించారు. మండల అధ్యక్షుడిగా దంద్రె ఇంద్రగోపాల్, ప్రధాన కార్యదర్శిగా ఆసీఫ్, ఉపాధ్యక్షుడిగా రాజమోహన్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆరె రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో నిరంతరం కృషి చేస్తామని, పీఎస్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులు సాధించడం, పీఆర్సీ, ఎస్‌జీటీలకు కామన్ మెరిట్ వంటి సమస్యల పరిష్కారంలో ముందుంటామన్నారు. అలాగే నూతన మండల కమిటీకి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుచ్చిరాములు, రాష్ట్ర బాధ్యులు కోనేటి దయాకర్, బిట్ల వేణు, చాగంటి ఆనంద్ పాల్గొన్నారు.

పండ్లతో అలంకరణ



కాటారం: శ్రావణమాసం పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీ భక్తాంజనేయ స్వామి పలు రకాల పండ్లతో మంగళవారం మహా అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రానికి చెందిన వెన్నపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, స్వరూప దంపతుల ఆధ్వర్యంలో 11 రకాల పండ్లతో అత్యంత సుందరంగా అలంకరించారు. అంతకముందు ఆలయ పురోహితుడు నిఖిల్ శాస్త్రి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చీర్ల శ్రావణ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు మద్ది నవీన్, పులి అశోక్, బొల్లం రాజబాబు, వెంకటేశ్ పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రేగొండ: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు. చిట్యాల మండలం కాల్వపల్లి నుంచి రేగొండ మీదుగా ఇసుకను తరలిస్తుండగా ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమాని కోళ్ల సురేందర్, డ్రైవర్ రాజేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక డంపులు సీజ్

అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను రేగొండ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. అనుమతి లేకుండా మండలకేంద్రంలో రెండు ఇసుక డంపులు నిల్వ ఉంచారు. మంగళవారం తహసీల్దార్ ఆదేశాల మేరకు అక్రమంగా నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

సీసీరోడ్డు నిర్మాణానికి దాతల సాయం



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానం ప్రసాదశాల నుంచి కట్టమీద ఆంజనేయస్వామి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి దాతలు కాళేశ్వరానికి చెందిన గందెసిరి మధుసూదన్, మంచిర్యాలకు చెందిన సంతోష్ సాయం అందించారు. ఈ మేరకు మంగళవారం రోడ్డు పనులను వారు ప్రారంభించగా మంగళవారం ఈఓ మారుతి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ పనులను పర్యవేక్షించారు. రూ.1.30లక్షలతో సుమారు 90మీటర్ల పొడవుతో సీసీ రోడ్డు నిర్మాణం చేశారు. కాంగ్రెస్ నాయకులు పోటు మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

కాచి చల్లార్చిన నీటిని తాగాలి


వెంకటాపురం(కె): వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ


మంగపేట: పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి వైశాలి

వెంకటాపురం(కె): కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని శివాపురం, చొక్కాల, రామాంజపురం, బర్లగూడెం, వీరభద్రవరం గ్రామాల్లో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు స్నేహ, వైద్య సిబ్బంది జ్యోతి, మనోహర్, యాకలక్ష్మి, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

మంగపేట: మండలంలోని భిక్షంపేటలో మంగపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వైశాలి ఆధ్వర్యంలో మగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 90 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అదే విధంగా జ్వరం, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి రక్త పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రధానంగా జ్వరంతో బాధపడుతున్న వారి ఇంటి పరసరాలను పరిశీలించి డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎక్కువగా వైరల్ ఫీవర్ ఉంటున్నాయని వైరల్ ఫీవర్ వచ్చినపుడు గొంతు నొప్పి, చర్మంపై అలెర్జీ, కీళ్ల నొప్పులు ఉంటాయన్నారు. బాధితులు ఎలాంటి ఆందోళన చెందకుండా మందులు వాడటంతో పాటు సరైన పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


వాడగూడెంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి యమున

వాడగూడెంలో..

మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో వాడగూడెంలో మగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 47 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. నలుగురు జ్వరపీడితులకు మలేరియా రక్త పరీక్షలు నిర్వహించగా నెగిటీవ్ రిపోర్టు వచ్చింది. అనంతరం వాడగూడెంతో పాటు కొత్తమల్లూరు, మామిడిగూడెం, నర్సింహాసాగర్ గ్రామాల్లో ఇంటింటి ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం భాగ్యలక్ష్మి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


సోలార్ స్తంభంపై ఉన్న కరెంట్ వైర్లు

గోవిందరావుపేట: మండల పరిధిలోని చల్వాయి గ్రామంలో బస్టాండ్ వద్ద సోలార్ వీధి లైట్లు స్తంభం గతంలో ఏర్పాటు చేశారు. కాగా ఆ స్తంభం పైనుంచి దాదాపు అరఫీటు దూరంలోనే ఫేస్ విద్యుత్ లైన్ వెళ్లడంతో ప్రమాదం పొంచి ఉంది. వివరాల్లోకి వెళ్లితే.. గతంలో అక్కడ సోలార్ వీధి లైట్ల స్తంభాన్ని ఏర్పాటు చేసి నాలుగు లైట్లను అమర్చారు. ఇటీవల రోడ్డు విస్తరణలో భాగంగా సోలార్ స్తంభంపై నుంచే చల్వాయి సబ్ స్టేషన్ నుంచి త్రి ఫేస్ కరెంట్ లైన్ వేశారు. రోజు రోజుకు త్రి ఫేస్ లైన్ వైర్లు సోలార్ ప్లేట్లకు దగ్గరగా వచ్చి కరెంట్ తీగలకు, సోలార్ ప్లేట్లకు కేవలం అరఫీట్ గ్యాప్ మాత్రమే ఉంది. గాలి వీచిన సమయంలో తాకే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. ఎప్పుడు రద్దీగా ఉండే ప్రదేశం, 24 గంటలు ప్రయాణీకులు నిలబడే స్టేజి, అక్కడే ఆటో స్టాండ్‌లు ఉంటాయి. అధికారులకు తెలిపిన పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరుగకముందే సంబంధిత అధికారులు స్పందించి అక్కడి నుంచి ఆ సోలార్ లైట్ల స్తంభం తొలగించి వేరే వద్ద ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి


బ్యాంకు మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ములుగు రూరల్: ఏజెన్సీ గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాలు లేక పహాణీ నకల్ ఆదారంగా పంట రుణాలు పొందిన రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ వర్తింపచేయాలని రాష్ట్ర రైతు సంఘం జిల్లా కన్వీనర్ ఎండీ అమ్జద్ పాషా డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని జంగాలపల్లి యూనియన్ బ్యాంక్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అమ్జద్ పాషా మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులకు రెండు లక్షల రూపాయలను రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి నిబంధనలు అమలు చేయడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో 40శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజిరెడ్డి, రఘు, రహీం, శాంతమ్మ, సమ్మయ్య, లింగస్వామి, లక్ష్మీ, రమేశ్, కుమారస్వామి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయాన్ని పెంపొందించుకోవాలి


వాజేడు: మహాసభలో పాల్గొన్న అధికారులు


వెంకటాపురం(కె)లో.. మహిళ సమాఖ్య మహాసభ

వాజేడు: మహిళా సంఘాలు తమ ఆదాయాన్ని పెంపొందించుకునే దిశగా దృష్టి సారించాలని ఎంపీడీఓ విజయ, డీపీఎంలు వేణుగోపాల్ రెడ్డి, గోవింద్ చౌహాన్ అన్నారు. మండల కేంద్రంలోని ఇందిరా క్రాంతిపథం కార్యాలయంలో మంగళవారం వార్షిక మహాసభను మండల సమాఖ్య అధ్యక్షురాలు జాక సమ్మక్క అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్న వ్యాపారాల అభివృద్ధి, గేదెల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం, ఆహార ఉత్పత్తుల పరిశ్రమల ఏర్పాటు వంటి వాటిలో అగ్రగామిగా నిలబడాలన్నారు. మహిళా సంఘాలు తీసుకున్న అన్ని రకాల రుణాలను సకాలంలో చెల్లించాలని సూచించారు.

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల మహిళ సమాఖ్య 16వ వార్షిక మహాసభను పూనెం లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత మహాసభ నుంచి నేటి వరకు జరిగిన ప్రగతి నివేదికను వివరించారు. అనంతరం భవిష్యత్‌లో చేయాల్సిన కార్యక్రమాలపై చర్చించి తీర్మానాలు చేశారు. గ్రామ సంఘాల అభివృద్ధి తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం వేణుగోపాల్‌రెడ్డి, గోవింద్ చౌహన్, స్త్రీనిధి ఆర్ఎం అశోక్, ఏపీఎం కరుణాకర్, సీసీలు నర్సయ్య, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

హేమాచలక్షేత్రంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ కృష్ణజన్మాష్టమి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హేమాచల క్షేత్రంలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఆలయ ఈఓ సత్యనారాయణ పర్యవేక్షణలో ఉట్టికొట్టే కార్యక్రమ చేపట్టారు. గ్రామంలోని చిన్నారులు, యువకులు పాల్గొని ఉట్టిని కొట్టేందుకు పోటీ పడ్డారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాల అడ్డగింత

కన్నాయిగూడెం: మండలంలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మట్టి తవ్వకాలను తహసీల్దార్ ఎండీ.సలీమ్ మంగళవారం అడ్డుకున్నారు. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బుట్టాయిగూడెం వద్ద సర్వే నం.165లో ఎలాంటి అనుమతులు లేకుండా మట్టితవ్వకాలు నిర్వహిస్తున్నరనే సమాచారం మేరకు అధికారులతో వెళ్లి అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆరు ట్రాక్టర్లు, ప్రొక్లెయినర్‌ను స్వాధీనం చేసుకుని సీజ్ చేసి తుపాకులగూడెంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు. పూర్తి విచారణ అనంతరం చర్యలు ఉంటాయని తెలిపారు.

నేలమట్టమైన పెంకుటిల్లు


నేలమట్టమైన పెకుటిల్లు


ధ్వంసమైన ఆటో

- ఆటో, ద్విచక్ర వాహనం ధ్వంసం

మంగపేట: మండలంలోని నర్సింహాసాగర్ గ్రామానికి చెందిన జాగటి సతీశ్ పెంకుటిల్లు మంగళవారం కూలి నేలమట్టం అయింది. వివరాలు ఇలా ఉన్నాయి.. బాధితుడు సతీష్ తన తల్లితో కలిసి ఆటో నడుపుకుంటు జీవనం సాగిస్తున్నాడు. రోజు వారిగా ఆటో కిరాయికి వెల్లి వచ్చి ఇంటివద్ద ఉంచి బయటకు వెళ్లాడు. కాగా, ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నేల తడిసి ఒక్క సారిగా పెంకుటిల్లు కుప్పకూలి నేలమట్టమైంది. దీంతో ఇంటి కింద ఉంచిన ఆటో, ద్విచక్ర వాహనం ధ్వసమయ్యాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కూలిపోవడంతో ప్రాణాప్రాయం తప్పింది. ఆటో ధ్వంసం కావడంతో జీవనోపాధి కోల్పోవడంతో పాటు ఇంట్లోని వస్తువులు సైతం ధ్వంసం కావడంతో సుమారు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని బాధితులు సతీశ్ వాపోయాడు.

పీఏసీఎస్‌లో రైతులకు మోసం


మాట్లాడుతున్న మల్లేశ్

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) అధికారులు రైతులను మోసం చేస్తున్నారని వారిపై చర్య తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం వద్ద రైతులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. మండలంలోని చింతకుంట రామయ్యపల్లి గ్రామానికి చెందిన ఏలేటి చంద్రయ్య అనే రైతు గతంలో సహకార సంఘంలో కొంత డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు. దీంతో గతంలో తీసుకున్న డబ్బులతో పాటు వడ్డీతో సహా మొత్తం 2016 సంవత్సరంలో రూ.1,62,92లు చెల్లించి రశీదు కూడా తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో ఇటీవల పరపతి సంఘం కార్యాలయానికి వెళ్లి చూడగా అందులో మళ్లీ అప్పు ఉన్నట్లుగానే చూపెడుతుందని వాపోయారు. అలాగే కొంత మంది రైతులు గతంలో పరపతి సంఘం కార్యాలయంలో సభ్యత్వం తీసుకున్నారు. తీసుకున్న రైతుల ఆధార్ కార్డు ఒకే ఇంటి పేరు ఉంటే ఆధార్ కార్డుపై మరో రైతుకు అక్రమంగా రుణాలు ఇచ్చారని ఆరోపించారు. ఇలా వందల మందికి రుణాలు ఇవ్వడం వలన సభ్యత్వం తీసుకున్న రైతులకు అన్యాయం జరిగిందన్నారు. అలాగే టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి గ్రామానికి చెందిన కందుల రవీందర్‌కు చెందిన ఆధార్ కార్డుపై మరో వ్యక్తికి రూ.46 వేలు రుణం ఇచ్చారని పేర్కొన్నారు. ఈ మేరకు సహకార పరపతి సంఘంలో ఇలాంటి ఘటనలు మరెన్నో అక్రమాలు జరిగయాని జిల్లా అధికారులు వాటిని బయటకు తీసి రైతులకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు రవీందర్, నరసింహారెడ్డి, జగన్‌రెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ సభ్యత్వ నమోదు


సభ్యత్వాలు నమోదు చేస్తున్న నాయకులు

మహాముత్తారం: రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో భాగంగా మంగళవారం మండలంలోని నిమ్మగూడెం గ్రామంలో యూత్ కాంగ్రెస్ నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో అన్ని గ్రామాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతం చేసే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని యువకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐవైసీ మండల ఇన్‌చార్జ్ నజీర్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ అభ్యర్థి జాటోత్ వంశిరాజ్, వినయ్, విజయ్, రఘుపాల్ రాకేష్‌నాయక్, రాజేంద్రప్రసాద్, రవి, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

ఇంటి నిర్మాణ సామగ్రి అందజేత


రేకుల షెడ్ నిర్మాణ సామగ్రిని అందజేస్తున్న నాయకులు

మంగపేట: మండలంలోని కొత్తమల్లూరు(బెస్తగూడెం) గ్రామానికి చెందిన రెబ్బల రాములు ఇల్లు అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. దీంతో సర్వస్వం కోల్పోయి నిలువ నీడలేక కట్టు బట్టలతో మిగిలిపోయిన విషయాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రిలక్ష్మణ్‌రావు తెలుసుకుని ఇంటి నిర్మాణం కోసం రూ.25,000 విలువైన సిమెంటు పోల్స్, రేకులు, ఐరన్ పైపులు తదితర సామగ్రిని పంపించాడు. బాధితుడితో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకుడు తాటి కృష్ణ, మంగపేట పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, డైరెక్టర్ లక్ష్మణ్‌రావు, జిల్లా, మండల నాయకులు రాజేందర్, శ్రీనివాసాచారి, ధనలక్ష్మి, భాస్కర్, నర్సింహులు, రమేశ్ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్ గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

సైనిక్ స్కూల్‌కు విద్యార్థి ఎంపిక

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఈర్ల గట్టుమల్లికార్జున నాగ్‌పూర్‌లోని ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌లో ఆరవతరగతి ప్రవేశానికి ఎంపికయ్యాడు. జనవరి 28న పరీక్ష రాయగా అందులో 224 మార్కులతో ఎంపికయ్యాడు. విద్యార్థి స్థానిక గ్రీన్‌వుడ్ పాఠశాలలో 5వ తరగతి వరకు విద్యనభ్యసించాడు. రెండు నెలలుగా 6వ తరగతిలో గుడ్‌మార్నింగ్ స్కూల్‌లో చదువుతున్నాడు. విద్యార్థిని గ్రామస్తులతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఏబీవీపీ పట్టణ కార్యదర్శిగా అఖిల్



ములుగు రూరల్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ములుగు పట్టణ కార్యదర్శిగా బానోత్ అఖిల్‌ను నియమించినట్లు ఆ సంఘం జిల్లా కన్వీనర్ మమన్ యాదవ్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన ఏబీవీపీ, బీజేపీ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రవి

ఏటూరునాగారం: జిల్లాలోని కస్తూరిబా గాంధీ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) డివిజన్ కార్యదర్శి జాగటి రవితేజ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రవితేజ మాట్లాడారు. జిల్లాలోని కస్తూరిబా గాంధీ పాఠశాలల్లో గత సంవత్సరం స్కావెంజర్ వర్కర్, అటెండర్, అకౌంటెంట్, టీచింగ్ స్టాప్ పోస్టుల్లో అధికారులు అండదండతో వారి బంధువులు, కార్యకర్తలను నియమించుకున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నాతాధికారులు సమగ్ర విచారణ నిర్వహించి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బైరేశ్, స్వామి, బాలేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి


గణపురం: గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి సహకరించాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని కోటగుళ్లను సందర్శించడానికి వచ్చిన గవర్నర్‌కు ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. అనంతరం గణపురం మండలకేంద్రంలోని కోటగుళ్లు, రేగొండ మండలంలోని పాండవుల గుట్ట, బుగులోని వెంకటేశ్వరస్వామి, చిట్యాల మండలంలోని నాపాక ఆలయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ప్రత్యేక నిధులు ఇచ్చేలా చొరువ తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు. అలాగే జిల్లా కేంద్రంలో రెడ్‌క్రాస్ భవన నిర్మాణం జరుగుతుందని అందులో అవసరమయ్యే (ఎస్‌డీపీ)సింగిల్ డోనర్ ప్లేట్‌లేట్ మిషన్ లాగే (పీఆర్‌పీ)ప్లేట్‌లేట్ రిచ్ ప్లాస్మా మిషన్‌లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. మహబుబూబాద్ ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్ రాహుల్ శర్మ ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

రాష్ట్రంలో గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం గణపురం మండలంలోని బుద్దారం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే ఆదర్శంగా మార్చడానికి నిర్విర్యామంగా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పలువురు మాజీ ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇన్సూరెన్స్ చేయించుకోవాలి

భూపాలపల్లి రూరల్: జీవిత బీమా ఇన్సూరెన్స్‌ల పాలసీలు ప్రతి ఒక్కరూ చేయించుకోవాలని ఎమ్మెల్యే సత్యానారాయణరావు సూచించారు. శ్రీరామ్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి అనివార్య కారణాలతో మృతి చెందిన కుటుంబాల సభ్యులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేయగా వారికి ఎమ్మెల్యే చెక్కులు అందజేశారు.

విష పురుగు కాటు.. కానిస్టేబుల్‌కు అస్వస్థత


చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ ప్రశాంత్

వెంకటాపురం(ఎం) : గవర్నర్ పర్యటన నేపథ్యంలో రామప్ప పరిసర అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తున్న స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ గుండ్ల ప్రశాంత్‌ను విషపురుగు కుట్టడంతో ఆస్వస్థతకు గురయ్యాడు. తోటి కానిస్టేబుల్ ప్రశాంత్‌ను చికిత్స నిమిత్తం వెంకటాపురం పీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ శ్రీకాంత్ వైద్య సేవలందించి, మెరుగైన చికిత్స కోసం ములుగు జిల్లా ఆస్పత్రికి రెఫర్ చేశారు. ప్రస్తుతం కానిస్టేబుల్ ఆరోగ్యం నిలకడగానే ఉందని బుధవారం డిశ్చార్జ్ చేస్తామని డాక్టర్ వినయ్ వెల్లడించారు. స్పెషల్ పార్టీ కానిస్టేబుల్ పాము కాటుకు గురైనట్లు వస్తున్న వార్తలు అవాస్తమని, ఊట్లతోగు ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా కీటకం కుట్టి ఆస్వస్థతకు గురైనట్లు ఎస్పీ శబరీష్ తెలిపారు.